
సాక్షి
బాపట్ల
గురువారం । 19 । డిసెంబర్ । 2024




సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1902 క్యూసెక్కులు విడుదల చేశారు. మిగిలిన కాలువలకు కూడా నీటిని విడుదల చేశారు.



దుర్గమ్మ ఆదాయం రూ. 3.68 కోట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వారికి భక్తులు హుండీల ద్వారా రూ. 3.68 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులుగా సమర్పించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 579.00 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,067 క్యూసెక్కులు విడుదలవుతోంది.

‘అసైన్డ్’ ఫర్ సేల్

- వేటపాలెం మండలంలో 50 ఎకరాలకు పైగా డ్రైనేజీ భూములు కబ్జా
- రొంపేరు, మునలమ్మ మురుగునీటి కాలువల కోసం పూర్వం భూముల కేటాయింపు
- ఆక్రమించి అమ్మకానికి పెట్టిన పచ్చనేత అనుచరుడు
- సగం భూమిని ఆక్రమించిన మాజీ ఎమ్మెల్యే మద్దతుదారుడు
- మిగిలిన భూమి తనదంటూ అమ్మకానికి పెట్టిన డ్రైనేజీ రిటైర్డ్ అధికారి
- ఎకరం రూ. 4 నుంచి 5 లక్షల చొప్పున అమ్మకం
- అగ్రిమెంట్లపై క్రయ విక్రయాలు
- ఎక్కువ భూమిని కొన్న మాజీ ఎమ్మెల్యే అనుచరుడు
- ప్రభుత్వ భూమిలో రొయ్యల చెరువుల సాగుకు ఏర్పాట్లు
- ఆక్రమణదారులతో డ్రైనేజీ అధికారులు కుమ్మక్కు
- ముడుపులు పుచ్చుకొని భూములు అప్పగించారన్న ఆరోపణలు

చీరాలలో సర్కార్ భూములు అమ్మకం



కబ్జా చేసిన భూముల్లో పంటల సాగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇసుక, బుసక, గ్రావెల్, గ్రానైట్‌ను మింగిన పచ్చనేతల కన్ను ఇప్పుడు ప్రభుత్వ భూములపై పడింది. కూటమి అధికారంలోకి వచ్చాక ఎక్కడ కాస్త జాగా కంట పడ్డా కబ్జా చేసేస్తున్నారు. ఇక ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములపై కనిపిస్తే కన్నేయకుండా ఉంటారా? రాత్రికి రాత్రే కొట్టేయడానికి కుట్రలు పన్నారు. పచ్చనేతతోపాటు ఒక మాజీ ఎమ్మెల్యే అనుచరుడి కన్నే కాదు ఇన్నాళ్లా సదరు భూములను కాపుకాసిన విశ్రాంత అధికారి కన్నూ పడింది. తలో కొంత పంచుకున్నారు. ఎటువంటి పట్టాలు పొందే అవకాశం కూడా లేని ఆ ప్రభుత్వ భూములను ఏకంగా విక్రయానికి పెట్టారు.

భూములను వదిలేసిన కుమ్మరులు

చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం మండలం సంతరావూరు బ్రిడ్జి సమీపంలో ప్రధాన రహదారికి పక్కనే రొంపేరు డ్రైన్, ముసలమ్మ మురుగునీటి కాలువల మధ్యన సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. డ్రైన్స్ నిర్మాణంలో భాగంగా ఆ భూములను పూర్వం ప్రభుత్వం కేటాయించినట్లు స్థానికులు చెబుతున్నారు. పది సంవత్సరాల కిందట వరకు ఈ ప్రాంతంలోని కుమ్మరులు (శాలివాహనులు) కుండలు, ఇతరత్రామట్టి పాత్రలు తయారు చేసేందుకు బంకమట్టిని తీసుకువెళ్లేవారు. అప్పట్లో భూములను కబ్జా చేసేందుకు కొందరు నేతలు ప్రయత్నించగా కుమ్మరులు అడ్డుకున్నారు. ఆ తర్వాత మట్టి పాత్రలకు డిమాండ్ పడిపోయి తయారీ నిలిచి పోవడంతో ఆ భూములను వదిలేశారు. దీంతో వాటిపై అక్రమార్కుల కన్నుపడింది.

కబ్జాలో పచ్చ మూకలు

చీరాల ప్రాంతానికి చెందిన పచ్చనేత అనుచరుడతోపాటు మాజీ ఎమ్మెల్యే అనుచరుడు, మరికొందరు ఆ భూములు తమవంటూ ఆక్రమించారు. సుమారు 10 మంది 15 ఎకరాలు ఆక్రమించి వరి, జొన్న పంటలు సాగు చేసేవారు. ఇంకొందరు తమ భూములంటూ హద్దులు గీసుకున్నారు. వేటపాలేనికి చెందిన డ్రైనేజీ విశ్రాంత అధికారి సైతం కొంత మేర ఆక్రమించారు. వాస్తవానికి డ్రెయినేజీ, డొంక, శ్మశాన తదితర పోరంబోకు భూములకు ప్రభుత్వం ఎటువంటి పట్టాలు ఇవ్వదు. ఇక్కడ కూడా ఏ ఒక్కరికీ పట్టాలు ఇవ్వలేదని తెలుస్తోంది. కానీ పచ్చనేత, మాజీ ఎమ్మెల్యేల అనుచరులు సుమారు 18 ఎకరాలు కబ్జా చేయడంతోపాటు ఆక్రమణ దారులనుంచి మిగిలిన భూములను ఎకరం రూ. 4 నుంచి 5 లక్షలకు కొనుగోలు చేశారు. ఇప్పటివరకూ 30 ఎకరాలకుపైగా డ్రైనేజీ భూములు అగ్రిమెంట్లపై క్రయవిక్రయాలు జరిగినట్లు సమాచారం. ఆక్రమించిన మాజీ డ్రైనేజీ విభాగం రిటైర్డ్ అధికారిసైతం భూములను అమ్మకానికి పెట్టినట్లు సమాచారం. ఎక్కువ మొత్తంలో భూములు స్వాధీనం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే అనుచరుడు రొయ్యల చెరువుల సాగుకు సిద్ధమయ్యారు.

చర్యలు తీసుకుంటాం

డ్రైనేజీ భూములను కొందరు సాగుచేసుకుంటున్న విషయం మా దృష్టిలో ఉంది. అయితే, కబ్జా విషయం నా దృష్టికి రాలేదు. విచారణ జరిపి క్రయవిక్రయాలు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటాం. అసైన్డ్ భూముల క్రయ విక్రయాలు నిషిద్ధం. చట్టరీత్యా నేరం.

–వెంకటసుబ్బారావు, డీఈ, మురుగునీటిపారుదల శాఖ

పట్టించుకోని అధికారులు

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా డ్రైనేజీ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. పైగా కబ్జాదారులతో కుమ్మక్కైనట్లు ఆరోపణలున్నాయి. 50 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున ముడుపులు చేతులు మారాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రొయ్యల చెరువులు వేసేందుకు సిద్ధమైన భూములు

జిల్లా ప్రగతే లక్ష్యం : కలెక్టర్



బాపట్ల: జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు అధికారులంతా ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి చెప్పారు. జిల్లా కలెక్టర్లతో ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి నిర్వహించిన సమావేశం అంశాలపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. 12 శాఖల పనితీరుపై ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. స్వర్ణ ఆంధ్ర-2047 లక్ష్యం దిశగా పనిచేయాలని ఆయన మార్గనిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంపై ఆధారపడిన బాపట్లలో రైతు ఉత్పత్తులను మరింత పెంచాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత నివ్వాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి కృషి

విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు.అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. మున్సిపాలిటీలు, పంచాయతీలలో ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేయబడిన షాపుల కేటాయింపులో 5% రిజర్వేషన్ అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. జిల్లా అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విఠలేశ్వర్, జేసీ ప్రఖర్‌జైన్ మాట్లాడారు. అనంతరం విభిన్న ప్రతిభావంతులకు టచ్ ఫోన్లు, మూడు చక్రాల సైకిళ్లను కలెక్టర్ అందజేశారు. డీఈవో పురుషోత్తం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రణవ్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు అర్చన, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘాల నాయకులు చల్లా రామయ్య, నాయకులు రంగయ్య, ఆదిశేషు, వెంకటరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

5న హైందవ శంఖారావం



నిజాంపట్నం: హిందూ ధర్మ పరిరక్షణ కోసం జనవరి 5న విజయవాడలో హైందవ శంఖారావం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శైవ క్షేత్ర పీఠాధిపతులు శివస్వామీజీ తెలిపారు. జిల్లా ప్రజలంతా పాల్గొనాలని కోరారు.

నకిలీ బంగారంతో బురిడీ

అద్దంకి రూరల్: నకిలీ బంగారంతో జ్యూయలరీ షాపు యజమానికి బురిడీ కొట్టి, బంగారపు నగలు పట్టుకెళ్లిన సంఘటన గత నెల 29వ తేదీన అద్దంకిలో చోటు చేసుకుంది. మోసంపై షాపు యజమాని అర్వపల్లి బ్రహ్మానందం బుధవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హెచ్‌సీ అంకమ్మరావు కేసు నమోదు చేశారు. వివరాలు.. అద్దంకిలోని రామాటాకీస్ బాజార్‌లోని తిరుమల జ్యూయలరీకి గతనెల 29న ఆడ, మగా వచ్చారు. బంగారపు చైన్ కావాలని చెప్పడంతో షాపు యజమాని దగ్గరున్న అన్ని రకాలు చూపించాడు. అయితే, ఆ ఇద్దరూ తమ వద్దనున్న 32 గ్రాముల పాత చైన్లు ఉన్నాయని.. అవి తీసుకుని వాటి ధరకు కొత్తవి ఇవ్వాలని కోరారు. దీంతో షాపు యజమాని ఆ చైన్లు తీసుకుని తూకం వేసుకుని, వారు కోరిన 26 గ్రాములు ఉన్న ఒక చైను, ఉంగరాన్ని ఇచ్చాడు. అవి తీసుకుని, మిగిలిన బంగారానికి మళ్లీ వచ్చి తీసుకుంటామని చెప్పి వెళ్లారు. ఈ నెల 17వ తేదీ వరకు చూసినా వారు రాకపోవడంతో వాటి కరిగించగా నకిలీ బంగారంగా తేలింది. మోసపోయానని గ్రహించిన షాపు యజమాని బుధవారం స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టపగలు చైన్ స్నాచింగ్

పర్చూరు(చినగంజాం): పట్టపగలు మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కొని పరారైన సంఘటన పర్చూరులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కనమర్లపూడి శ్రీదేవి స్థానిక ఎలక్ట్రికల్ షాపులో అకౌంటెంట్‌గా పని చేస్తోంది. బుధవారం మధ్యాహ్నం భోజనం అనంతరం కెనరా బ్యాంక్ బజారులో నుంచి షాపునకు వెళుతున్న సమయంలో ఎదురుగా వచ్చిన దుండగుడు తొలుత ఆమె మెడలో ఉన్న నల్లపూసల తాడు బంగారు గొలుసు లాక్కొనేందుకు ప్రయత్నించాడు. గొలుసు రాకపోవడంతో ఆమెను కింద పడేసి గొలుసును లాక్కొని మార్కెట్ మీదుగా అప్పటికే ఆగిఉన్న తెల్లకారులో ఇంకొల్లు వైపు పరారయ్యాడు. ఆమె ప్రతిఘటించడంతో నల్లపూసల తాడు ముక్క ఒకటి చేతిలో ఉండిపోయింది. దుండగుడు పారిపోయిన కారు వెనుక పద్మశాలి అని రాసి ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడిన శ్రీదేవి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ‘పైసా’చికం



తన్నీరు రేణుక

మార్టూరు: ప్లాస్టర్ సప్లై లేదంటూ బాధితురాలి నుంచి మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఒకరు రూ.200 వసూలు చేసిన ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. వలపర్ల వడ్డెర కాలనీకి చెందిన తన్నీరు రేణుకను ఆమె భర్త తన్నీరు జోగిప్ప మద్యం మత్తులో బుధవారం ఉదయం ఇనుప రాడ్డుతో తలపై కొట్టగా కుడి కంటిపై తీవ్ర గాయం అయింది. మార్టూరు స్టేషన్లో ఫిర్యాదు చేయడం కోసం వెళ్లిన రేణుకను పోలీసులు ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. కంటి చికిత్సకు అవసరమైన డైనో ప్లాస్టర్ ఆసుపత్రిలో లేనందున ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ శివ నాయక్ నుంచి రూ. 200 రూపాయలు వసూలు చేశాడని బాధితురాలు రేణుక మీడియా ప్రతినిధులకు తెలిపింది. తాను తిరిగి వలపర్ల వెళ్లడం కోసం ఆటో చార్జీలకు కూడా లేవని చెప్పినా వినకుండా అతడు తీసుకున్నట్లు వాపోయింది. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఫార్మసీ అసిస్టెంట్ కొనిపెట్టిన వాటర్ బాటిల్‌తో కడుపు నింపుకున్నట్లు తెలిపింది. ఈ విషయమై విలేకరులు శివనాయక్‌ను సంప్రదించగా తాను 200 రూపాయలు ఆమె నుంచి తీసుకున్న మాట నిజమేనని, ఆ చికిత్సకు అవసరమైన డైనో ప్లాస్టర్ ఆసుపత్రికి సప్లై ఉండదని, అందుకే తీసుకోవాల్సి వచ్చిందని చెప్పాడు. వంద రూపాయల విలువ చేయని ప్లాస్టర్ కోసం 200 రూపాయలు వసూలు చేయటం, ఇంత చిన్న మొత్తాలను పేషెంట్ల దగ్గర తీసుకోవడం ఏమిటంటూ మీడియా ప్రతినిధులు సూపరింటెండెంట్ డాక్టర్ విష్ణుతేజను వివరణ కోరారు. ఒకటి, అరా చిన్న చిన్న మొత్తాలకు బిల్లులు పెట్టటం కష్టమని.. అందుకని వాళ్ల దగ్గరే వసూలు చేస్తున్నట్లు చెప్పడం గమనార్హం. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తాకట్టుతో కనికట్టు

- ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల టార్గెట్
- దళిత కాలనీల్లో ఇంటికో దా‘రుణం’
- రెచ్చిపోతున్న ముఠాలు



భగవాన్‌రాజుపాలెంలో నాగిబోయిన మస్తాన్ ఇల్లు



బైటమంజులూరులో సుజాత ఇంటి బాత్రూంపై రాసిన నోటీసు

జె.పంగులూరు: మండలంలోని పలు గ్రామాల దళిత కాలనీల్లో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు దాదాగిరీ చేస్తున్నాయి. లోను ఇచ్చేది గోరంత.. వసూలు చేసేది కొండంతగా మారింది. వీరి ఆగడాలకు కొందరు దళితులు లోను కిస్తీలు చెల్లించలేక ఇళ్లు ఖాళీ చేస్తున్నారు. ఊరు వదిలి తలా దిక్కున తలదాచుకుంటున్నారు. అయినప్పటికీ ఇళ్లకు ‘అమ్మబడును’ అంటూ నోటీసులు అంటిస్తున్నారు. గతంలో మైక్రో ఫైనాన్స్‌ల ధాటికి ఎంతో మంది ప్రాణాలు బలయ్యాయి. ఆ ఉదంతం మరువక ముందు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలు రెచ్చిపోతున్నాయి. ‘పేదలపై ప్రవేటు కంపెనీ దాదాగిరీ’ అని సాక్షిలో బుధవారం భగవాన్‌రాజుపాలెం గురించి కథనం వచ్చిన సంగతి పాఠలకు తెలిసిందే. కాగా సాక్షి పూర్తి వివరాలు సేకరించగా.. బైటమంజులూరులోని దళిత కాలనీ మొత్తం తాకట్టులో ఉందని తేలింది.

ఊరు వదిలి వెళ్లిన కుటుంబం

భగవాన్‌రాజుపాలెం గ్రామానికి చెందిన నాగిపోగు యేసురత్నం కుమారుడు మస్తాన్‌కు భార్య, ఇద్దరు చిన్నపిల్లలున్నారు. సెంటు భూమి కూడా లేదు. కేవలం రెక్కల కష్టంమీదనే ఆధారపడి జీవించే కుటుంబం. ఇతను ఫైవ్ స్టార్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ వద్ద పది నెలల కిందట ఇంటిని తనఖా పెట్టి రూ. 2.50 లక్షలు రుణం తీసుకున్నాడు. ఫైనాన్స్ సంస్థ అతనికి ఇన్సూరెన్స్, రిజిస్ట్రేషన్ తదితర ఖర్చులు పోను రూ. 2.25 లక్షలు చేతికి ఇచ్చింది. దీన్ని నెలకి రూ. 6525 చొప్పున ఐదు సంవత్సరాల పాటు తీర్చాల్సి ఉంది. ఆరు నెలలు కిస్తీలు చెల్లించిన మస్తాన్, ఇంటిలో ఆర్థిక ఇబ్బందులతో నాలుగు నెలలుగా చెల్లించలేకపోయాడు. దీంతో సదరు సంస్థ వారు ఇంటి ముందు గొడవ చేశారు. బాకీ చెల్లించనందున ఈ ఇంటిని అమ్ముతున్నామని ముద్ర వేసి తలుపులకు తాళం వేసి, సీల్ వేసి వెళ్లిపోయారు. దీంతో ఆ కుటుంబం అవమానభారంతో అప్పు తీర్చే దారి లేక, తీర్చేందుకు ఎక్కడ పుట్టక, ఇల్లు వదిలి దూర ప్రాంతాలకు వెళ్లిపోయింది. ఈ పరిస్థితి భగవాన్ రాజుపాలెంలోని నాగిపోగు మస్తాన్‌ది ఒక్కడిదే కాదు.. ఈ చుట్టుపక్కల గ్రామాల్లోని దళిత కాలనీల్లో నెలకొంది. పిల్లల చదువు కోసం, కౌలు రైతుల పొలం పెట్టుబడుల నిమిత్తం ప్రైవేటు సంస్థల వద్ద పేద దళితులు లోన్లు తీసుకుంటున్నారు.

ఆగడాల అంతా ఇంత కాదు

మంగళవారం బైటమంజులూరు దళిత కాలనీలో అలూరి సుజాత ఇంటికి కూడా ఐఐఎఫ్ఎల్ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది తాళం వేసి సీలు వేసిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతంలో సుమారు 26 ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు ఇల్లు తాకట్టు పెట్టుకుని పేదలకు రుణాలు ఇస్తున్న విషయంపై ఆరా తీయగా తెలిసింది. ప్రైవేటు సంస్థల సిబ్బంది వీధి వీధికీ తిరిగి తాము రుణాలు ఇస్తామని పేదలను మభ్యపెట్టి వారి ఇల్లు తాకట్టు పెట్టుకొంటున్నారు. ఒక నెల, రెండు నెలలు కిస్తీలు చెల్లించకుంటే అనేక ఇబ్బందులు పెడుతున్నారు. ఇలా ఈ కాలనీలో 70 శాతం మంది దాకా రుణాల ఊబిలో కూరుకుపోయినట్లు తెలిసింది. అంతేకాదు.. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ ఫైనాన్స్ కంపెనీలు పాగా వేసినట్లు సమాచారం.

ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు ఇబ్బంది పెట్టే పేద ప్రజలను ప్రభుత్వమే ఆదుకోవాలని, వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు మొండ్రు ఆంజనేయులు, రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఇంటికి తాళం వేసి సీల్ వేసిన ఆలూరి సుజాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సంస్థల వల్ల ఎంతో మంది పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాలను ప్రభుత్వం అరికట్టాలని, వారి వల్ల నష్టపోయిన పేదలకు సాయంచేయాలని కోరారు. మండల పరిధిలో 21 గ్రామాల్లో ఉన్న దళిత కాలనీల్లో ఈపాటికే తాకట్టులోకి వెళ్లిపోయాయని తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న నాయకులు

శ్రీశైలం అడవుల్లో దారి తప్పిన భక్తులు సురక్షితం

నిజాంపట్నం నివాసులుగా గుర్తింపు

రేపల్లె రూరల్: ప్రకాశం జిల్లా నల్లమల అడవుల్లో దారితప్పిన భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. నిజాంపట్నానికి చెందిన మోపిదేవి ఓంకార్, సాంబశివరావు (క్రస్ పాయింట్ నిర్వాహకుడు)లు కుటుంబ సభ్యులతో పాటు కొంతమంది కలుపుకుని మొత్తం 15 మంది ఈ నెల 16న శ్రీశైలం దర్శనానికి వెళ్లారు. మల్లికార్జునస్వామి ఆలయంలో దర్శనం పూర్తయ్యాక నల్లమల అడవుల్లోని ఇష్టకామేశ్వరిదేవి ఆలయం సందర్శించేందుకు బుధవారం అడవిమార్గాన వెళుతూ దారి తప్పారు. ఈ విషయాన్ని గ్రహించి భయాందోళనకు గురైన వీరు సాయంత్రం 6 గంటల సమయంలో 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, స్థానిక ఫారెస్ట్ అధికారుల సహాయంతో అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానంతో భక్తుల ఆచూకీ తెలుసుకుని, సురక్షితంగా శ్రీశైలం ప్రాంతానికి తరలించారు.




అడవిలో తప్పిపోయిన భక్తులు

సాహిత్య శిఖరాన అభ్యుదయ దీపిక

పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం

సాహిత్య శిఖరాన వినుకొండ కీర్తిబావుటా రెపరెపలాడింది. ఈ ప్రాంత వాసికి కేంద్ర ప్రభుత్వ అత్యున్నత పురస్కారం దక్కింది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు వినుకొండ ప్రాంతంలోని నూజెండ్ల మండలం పాతచెరుకుంపాలెం గ్రామ వాసి పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. కవి సామ్రాట్ గుర్రం జాషువా తర్వాత సాహిత్య లోకంలో వినుకొండ ఖ్యాతిని చాటిచెప్పిన ఘనత లక్ష్మీనారాయణకు దక్కుతోందనడంలో అతిశయోక్తి లేదు.



అవార్డుకు ఎంపికైన పుస్తకం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక
- లక్ష్మీనారాయణ స్వగ్రామం పాతచెరుకుంపాలెం
- గ్రామస్తుల హర్షాతిరేకాలు



వినుకొండ(నూజెండ్ల): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు పెనుగొండ లక్ష్మీనారాయణ ఎంపిక కావడంపై వినుకొండ ప్రాంతంలో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన స్నేహితులు, పాతచెరుకుంపాలెం గ్రామస్తులు ఈ అవార్డు తమ గ్రామానికి దక్కినట్టుగా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 1954లో పాత చెరుకుంపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు రెండో సంతానంగా లక్ష్మీనారాయణ జన్మించారు. వీరిది వ్యవసాయ మధ్యతరగతి కుటుంబం. తండ్రి అదే గ్రామంలో బ్రాంచ్ పోస్టు మాస్టారుగా, గ్రామ మునసబుగా సేవలందించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చెరుకుంపాలెంలోనే లక్ష్మీనారాయణ ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. తరువాత 6 నుంచి 10 తరగతి వరకూ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్ వినుకొండ ప్రభుత్వ కళాశాలలో, ఉన్నత చదువులు గుంటూరులో పూర్తిచేశారు.

మాజీ ఎమ్మెల్యే ప్రోత్సాహంతో..

వినుకొండ మాజీ ఎమ్మెల్యే పులుపుల వెంకటశివయ్య ప్రోత్సాహంతో సాహిత్యం వైపు అడుగులు వేసి అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలు అందించారు. ప్రస్తుతం అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులుగా సేవలందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించింది. ప్రస్తుతం లక్ష్మీనారాయణ గుంటూరులో స్థిరపడ్డారు.



పాతచెరుకుంపాలెంలో లక్ష్మీనారాయణ ఇల్లు

స్నేహితుడిగా ఆనందంగా ఉంది



నేను, లక్ష్మీనారాయణ ఫిరంగిపురంలోని సెయింట్ పాల్ పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్నాం. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి కలిగిన లక్ష్మీనారాయణ తరువాత లా వరకు చదివి సాహిత్యంపై ఆసక్తితో ఆ రంగంలోకి వెళ్లారు. అనేక కవితలు రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం గ్వరకారణం. అతను నా స్నేహితుడు కావడం ఎంతో ఆనందంగా ఉంది.

దగ్గుబాటి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్, పాతచెరుకుంపాలెం

కలిసి చదువుకున్నాం



లక్ష్మీనారాయణ , నేను కలిసి చదువుకున్నాం. చిన్నతనం నుంచి చురుకుగా ఉండే లక్ష్మీనారాయణ సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం మా గ్రామానికే గర్వకారణం. ఉన్నత చదువులు చదువుకుని అవార్డు అందుకోవడం అందరికీ ఆదర్శం.

– నూరె నాసర్‌రెడ్డి, పాతచెరుకుంపాలెం

క్లుప్తంగా

కారు ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి మార్టూరులో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ పులి ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అంబేడ్కర్ కాలనీలో నివాసం ఉంటున్న తోటకూర నాగేశ్వరరావు (60) స్థానికంగా జరుగుతున్న సెమీ క్రిస్మస్ వేడుకలకు హాజరై తిరిగి ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో తిరుపతి నుంచి గుంటూరు వెళుతున్న తమిళనాడుకు చెందిన కారు రోడ్డు దాటుతున్న నాగేశ్వరరావును ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఎన్‌యూ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం పెద్ద ఎత్తున దుమారం రేపుతోంది. ఈ సర్టిఫికెట్లతో వర్సిటీలో పీజీ కోర్సులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల ఇంటర్వ్యూల్లో గుర్తించిన స్పాట్ అడ్మిషన్ డైరెక్టర్ బ్రహ్మాజీరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శివప్రసాద్‌లు ఉన్నతాధికారుల దృష్టికి విషయం తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ జరపాలని పెదకాకాని పోలీసులకు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామిని వివరణ కోరగా.. వర్సిటీ నుంచి ఫిర్యాదు అందిందని, ఉన్నతాధికారుల అనుమతి మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సమన్వయంతో శంకర్‌విలాస్ ఆర్వోబీ నిర్మాణం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించిన క్షేత్ర స్థాయి పనులను ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న ఈ ఆర్వోబీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపాయని, నిర్మాణం కోసం రోడ్డు విస్తరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే అరండల్ పేట, బ్రాడీపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో, ఏఈఎల్‌సీ చర్చి, ఆర్‌సీఎం చర్చి ప్రతినిధులుతో సమావేశమయ్యామని వివరించారు. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నామన్నారు. ఆర్వోబీ నిర్మాణం, సర్వీస్ రోడ్ మార్కింగ్ వంటి పనులను వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్, రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అవసరమైతే జాయింట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఆర్ అండ్ బీ ఎస్ఈ ఆర్.శ్రీనివాస మూర్తి, ఈఈ సి.విశ్వనాథరెడ్డి, డీఈఈ చిన్నయ్య, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

ముం'చెత్త'న నిర్లక్ష్యం



గిరిజనులకు అవాస కేంద్రంగా మారిన పూండ్ల పంచాయతీలోని చెత్త సంపద కేంద్రం



పూండ్లలో రోడ్లపై దర్శనం ఇస్తున్న చెత్తాచెదారం నిల్వలు

- నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు
- పంచాయతీల్లో లోపిస్తున్న పారిశుధ్యం
- నెరవేరని స్వచ్ఛభారత్ లక్ష్యం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- గ్రామాల్లో విచ్చలవిడిగా దర్శనం ఇస్తున్న చెత్త
- బురదలో పోసిన పన్నీరైన రూ. కోట్ల నిధులు

బాపట్ల టౌన్: జిల్లాలో కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అధికారుల నిర్లక్ష్యంతో వీధుల్లో చెత్తాచెదారం నిల్వలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. స్వచ్ఛభారత్ లక్ష్యంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 25 మండలాల పరిధిలో 459 పంచాయతీలకు నిధులు కేటాయించింది. జనాభా ప్రాతిపదికన మైనర్ పంచాయతీలకు రూ. 2.5 లక్షల నుంచి 3 లక్షల వరకు, మేజర్ పంచాయతీలకు రూ. 5 లక్షల నుంచి 6.5 లక్షల వరకు ఇచ్చింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా రూ. 25 కోట్లు వ్యయంతో నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు అధికారుల అలసత్వం కారణంగా ఎందుకూ పనికిరాకుండా తయారయ్యాయి. చెత్త సేకరణకు రిక్షాలు, మేజర్ పంచాయతీలకు ట్రాక్టర్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంటింటి నుంచి చెత్త సేకరణ, వర్మికంపోస్టు తయారీకి హరితరాయబారులను నియమించినా అధికారుల్లో 'చెత్తశుద్ధి' కరువైంది.

చెత్త ఫుల్.. సంపద నిల్

క్షేత్రస్థాయిలో సిబ్బందితో చెత్తను సేకరించి వాటి నుంచి సంపద తయారు చేయటంలో ప్రధానంగా పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా వ్యర్థాల సేకరణ, వర్మికంపోస్టు తయారీని పట్టించుకోకపోవడంతో సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇటీవల గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతాహి కార్యక్రమాలు 15 రోజుల పాటు నిర్వహించినా అవి కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయే గానీ క్షేత్రస్థాయిలో అమలు జరగలేదు. డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరు చేసి ఎరువు తయారీతోపాటు వానపాములను ఉత్పత్తి చేయాలి. ఇక్కడ తయారైన ఎరువును రైతులకు విక్రయిస్తే పంచాయతీకు కొంతమేరా ఆదాయం సమకూరుతుంది. కానీ, చెత్తతో ఎరువులు తయారుచేస్తున్న ఘటనలు ఏ ఒక్క గ్రామంలో మచ్చుకైనా కనిపించడం లేదు. డంపింగ్ యార్డులకు చెత్తను తీసుకురాకుండా గ్రామాల సమీపంలోని రోడ్డు మార్జిన్, ఊరి శివారు ప్రాంతాల్లోని గుంతల్లో పడేస్తున్నారు. డంపింగ్ యార్డుకు తరలించడానికి ప్రభుత్వం ఇచ్చిన రిక్షాలను సక్రమంగా వినియోగించకపోవడంతో శిథిలమవుతున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారిపోవడంతో గ్రామస్తులు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు లక్ష్యసాధన ముఖ్యం



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు లక్ష్యసాధన ముఖ్యమని, అందుకు కృషి, పట్టుదల, ప్రణాళిక అవసరం అని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో 27వ బాలికల అంతర్ పాలిటెక్నిక్ జిల్లాస్థాయి ఆటల పోటీలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. తొలుత క్రీడాకారులను గౌరవ వందన స్వీకరించారు. జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షత వహించారు. అనంతరం కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులకు లక్ష్య నిర్దేశం అవసరం అని చెప్పారు. దాని సాధనలో అధ్యాపకుల బోధనలతో పాటు స్వీయ కృషి ప్రధానమని సూచించారు. కృషి, పట్టుదల, ప్రణాళిక మినహా షార్ట్ కట్‌లు ఉండవని స్పష్టం చేశారు. గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలన్నారు. 1993లో గ్రామ అభివృద్ధి అధికారిగా ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన తాను ప్రస్తుతం ఐఏఎస్ అధికారిగా ఉన్నత స్థాయికి చేరడం వెనుక కఠోర శ్రమ ఉందని తెలిపారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ.. క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ.. ఈ కళాశాల బాలికల భవిష్యత్‌కు ఎంతో అండగా నిలిచిందన్నారు. విద్యార్థినులను చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అభివృద్ధికి కమిషనర్ శ్రీనివాసులు, ఎంవీఐ రాఘవరావు చెరొక రూ.20 వేలు విరాళంగా అందజేశారు. జిల్లా వ్యాప్తంగా 18 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అతిథులు వాలీబాల్ ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ టి.శేఖర్, ప్రభుత్వ టెక్స్‌టైల్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు, పీడీలు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

వేటపాలెం: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని కొత్తపాలేంలో జరిగింది. గ్రామానికి చెందిన ప్రభుదేవ (37) మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయి రాత్రి సమయంలో ఇంటి ముందున్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఎం. వెంకటేశ్వర్లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శరీరదానం చేసిన దంపతులకు అభినందనలు



మంగళగిరి: శరీరదానంలో ఈమని వెంకటరెడ్డి , శారద దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. దుగ్గిరాల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన ఈ దంపతులు శరీరాన్ని దానం చేస్తూ ఎయిమ్స్ ఆసుపత్రికి పత్రం రాసిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం అఖిల భారత శరీర, అవయదాన సంఘం, బుద్ధ విహార ఆధ్వర్యంలో వారిని సత్కరించారు. సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి రేఖా నర్మద, బుద్ధ విహార అధ్యక్షుడు రేకా కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకు ఉత్సవాలు



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈ నెల 21, 22వ తేదీలలో జాతీయ స్థాయి యువజనోత్సవం వివా వీవీఐటీ 2కే 24–25 నిర్వహించనున్నట్లు బుధవారం వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వరల్డ్ ఈజ్ వన్ పేరిట ఈ యువజనోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలో విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకత, నైపుణ్యం వెలికితీసేలా సాంకేతిక, క్రీడా, సాంస్కృతిక విభాగాలలో 93 అంశాలలో పోటీలు ఉంటాయని వివరించారు. వాల్‌పోస్టర్లను విద్యార్థులతో కలిసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ ఎకడమిక్స్ డాక్టర్ కె. గిరిబాబు పాల్గొన్నారు.

కృష్ణానదిలో వ్యక్తి మృతదేహం

కానూరు వాసిగా గుర్తింపు



నది నుంచి బయటకు తీసిన రామకృష్ణ మృతదేహం



రామకృష్ణ (ఫైల్)

తాడేపల్లి రూరల్: కృష్ణానది పుష్కర ఘాట్‌ల వద్ద మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు బుధవారం రాత్రి అక్కడికి చేరుకున్నారు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికి తీయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మృతదేహాన్ని వెలికి తీశామని, ఒడ్డున ఏపీ 39 వీజే 9929 నెంబరు ఆటో నిలిపి ఉందని తెలిపారు. ఆటోను పరిశీలించగా రామకృష్ణ పేరుతో ఆధార్ కార్డు లభించిందని, దాని ఆధారంగా ఆ వ్యక్తిది విజయవాడ కానూరు అని నిర్ధారించామని చెప్పారు. ఆటోలో బ్యాంక్ పాసు పుస్తకం, ఫోన్ లభించాయన్నారు. ఫోన్‌లో కాంటాక్ట్ నెంబర్లను సంప్రదించగా ఎవరూ సరైన సమాధానం ఇవ్వలేదని, బ్యాంక్ పాసు పుస్తకంలో ఉన్న అడ్రస్, ఆటో సీ బుక్‌లో చిరునామాలు వేరువేరుగా ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. మూడు అడ్రస్‌లను పరిశీలించి రామకృష్ణ మృతికి కారణాలు తెలుసుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం, ఆదాయం

హార్టికల్చర్ డీడీ శ్రీనివాసరావు



ఇతర రాష్ట్రాల రైతులతో వ్యవసాయాధికారులు

అల్లూరు(కర్లపాలెం): ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు గిట్టుబాటు ధరలతో పాటు మనుషులు ఆరోగ్యంగా ఉంటారని హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. పిట్టలవానిపాలెం మండలంలోని అల్లూరులో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయ పంటలను ఆగాఖాన్ రూరల్ సపోర్ట్ ప్రోగ్రాం టీమ్ సభ్యులైన గుజరాత్, మధ్యప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన 13మంది రైతులు సందర్శించారు. గ్రామంలో కెతోరా థెరీసా సాగు చేస్తున్న ఎనీటైమ్ మనీ పంటల విధానాన్ని, కృపావతి సాగు చేస్తున్న ఏ గ్రేడ్ మోడల్ వరిపైరు క్షేత్రాన్ని, వెంకటరెడ్డి సాగుచేస్తున్న మినుము పైరును, గో ఆధారిత ప్రకృతి వనరులతో సాగుచేస్తున్న సుబ్బారెడ్డి పెరటి తోటలను పరిశీలించారు. వీరికి హార్టికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు, రైతు సాధికార సంస్థ థీమాటిక్ లీడర్ శ్రీనివాసరావు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.శ్రీవాణి, అడిషనల్ డీపీఎం జె.మోహన్, మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వామి ఆశీస్సులతోనే మాలధారులకు అన్నసంతర్పణ

మాజీ ఎమ్మెల్సీ అన్నం



అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల: శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులతోనే అనేక సంవత్సరాలుగా మాలధారులకు అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 41 రోజుల సద్ది బుధవారంతో ముగియడంతో పూర్ణాహుతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా సతీష్ ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి పీఠం వద్ద ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీక్షపరులకు అన్నసంతర్పణ చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.

గురుస్వామి సుబ్బారావు మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా అన్నం సతీష్ ప్రభాకర్ సొంత నిధులతో సోమేశ్వరస్వామి దేవస్థానంలో మాల ధరించిన స్వాములకు సద్దిని నిర్వహిస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలోనూ ఆయనే సద్ది దాతగా నిలవనున్నారని చెప్పారు. స్వామి ఆశీస్సులు ఆయనపై ఎల్లవేళలా ఉండాలని, మరెందరికో సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు స్వాములు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకం

వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ప్రసంగిస్తున్న వీసీ ఆచార్య కె.గంగాధరరావు

ఏఎన్‌యూ: హెల్త్ కేర్ రంగంలో ప్రొఫెషనల్స్ సేవలు ఎంతో కీలకమని వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో 'అంతర్జాతీయ హెల్త్ కేర్ పరిశ్రమలో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ అవకాశాలు, సవాళ్లు' అంశంపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా వీసీ ప్రసంగిస్తూ.. హెల్త్ కేర్ రంగంపై అవగాహన పెంచుకుని మానవీయ విలువలతో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. కృత్రిమ మేధతో వైద్యరంగం వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతోందని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ వైద్య రంగంలో పరిశ్రమలను స్థాపించే స్థాయికి అందరూ ఎదగాలని సూచించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. ఎం.సురేష్ కుమార్, నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ ఇన్సూరెన్స్ రాష్ట్రస్థాయి సలహాదారు పసల జ్యోతి, విభాగాధిపతి ప్రొఫెసర్ బి. నాగరాజు, పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. వర్క్‌షాప్‌నకు హాజరైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

20 నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రాధాకృష్ణ మూర్తి, దుర్గాప్రసాద్, ఐజక్ ప్రసాద్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈ నెల 20, 21వ తేదీల్లో 'ఆదర్శ్ 2024' పేరుతో రాష్ట్ర స్థాయి అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలిపారు. బుధవారం కళాశాలలో క్రీడా పోటీలకు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు వేదిక అన్నారు. 20న క్రీడా పోటీలను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగ చైర్‌పర్సన్ పొడపాటి తేజస్విని ప్రారంభించనుండగా, 21న జరిగే బహుమతి ప్రధానోత్సవానికి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, క్రీడోత్సవాల సమన్వయకర్త డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, సాంస్కృతిక విభాగాల సమన్వయకర్త కొల్లా సుస్మిత చౌదరి, కృష్ణార్జునరావు, ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ కృషి స్ఫూర్తిదాయకం

తెనాలి: గుంటూరుకు చెందిన సాహిత్యకారుడు పెనుగొండ లక్ష్మీనారాయణ 'దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాసాల సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించటం అభినందనీయమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పెనుగొండ యాభై ఏళ్లుగా అభ్యుదయ సాహిత్య వికాసానికి తెలుగునాట చేస్తున్న కృషికి తగిన గుర్తింపుగా, అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్టు తెలిపారు. 1973లో సాధారణంగా మొదలైన పెనుగొండ అభ్యుదయ సాహిత్య ప్రస్థానం, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, నేడు అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష స్థానం వరకు కొనసాగటం విశేషం. విలక్షణమైన విమర్శకుడిగా పెనుగొండ కృషి అభ్యుదయ సాహిత్యకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

- అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ప్రకటనపై అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు.